
# జన్మహక్కు

కె. పద్మిని



"ఏమిట్రా? ఇంకా అలా చూస్తావు? గుడ్లప్పగించి! చేసిన వెధవపని చాలకా?" గంయ్‌మంటూ అరుస్తూంది శ్రీలత తన వంకే అలా నిలబడి చూస్తూన్న వాళ్ళింటి పని కుర్రాడు సూరిపై. ఆవిడలా అరిచేసరికి మెల్లిగా అక్కడనుంచి బయటకు వెళ్ళబోతూన్న పని కుర్రాడు సూరిగాడితో - "ఆహా! దర్జాగా వెళ్ళిపోతున్నావు. ఈ పడేసిన పాలిష్ డబ్బాలన్నీ ఎవరు తీస్తారటా? అన్నీ వదిలేసి పోతున్నావు? నే తీయ్యాలనా?" కోపంగా శ్రీలత అంటూంటే వాడేం మాట్లాడకుండా గబగబా ఆ పాలిష్ డబ్బాలు పట్టుకువెళ్ళిపోయాడు.

వెళ్ళిపోతూన్న వాడి వంక కసిగా చూస్తూ "దున్నపోతులా బలిశాడు! చూశారా? వాడి నిర్వాకం?" అక్కడే ఆ గదిలో కాస్త దూరంగా కూర్చుని, ఏదో కావ్య సంపుటి చదువుకుంటున్న భర్త శేఖర్‌తో అంది. ఆ కావ్య పఠనంలో మునిగిపోయి ఉన్న అతను ఆమె మాటలకు ఉలిక్కిపడి "ఏవిటి? పిలిచావా?" అన్నాడు.

"ల్లేదు" వెటకారంగా అంది శ్రీలత. భార్య కోపం గమనించి, రాబోయే ప్రమాదాన్ని గుర్తించినవాడై - "ఏవిటోయ్? ఏవిటీ? ఏమైందీ?" రిలాక్స్ చేయబోయాడు శ్రీమతి మూడ్‌ని.

"చాల్లెండీ, ఇందాకట్నించీ ఇక్కడింత గొడవ అవుతున్నా పట్టించుకోలే దన్నమాట. అవున్లెండి మీ రెందుకు...?" ఇంకా ఏదో అనబోతూండగానే-

"ఏవిటమ్మా? ఏవిటీ?" అంటూ వచ్చాడు శ్రీలత తండ్రి ప్రముఖ కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ. ఆయన అక్కడకు వస్తూనే సోఫాలో కూర్చుంటూ - "ఒరేయ్ సూరీ" అంటూ గట్టిగా పిలిచాడు.

"అబ్బో! అంత ఒక్క పిలుపుకే వస్తాడా? వాడికి రోజు రోజుకీ పెద్దా, చిన్నా తేడా తెలియడంలేదు నాన్నా! ఇందాక మన విక్కీ చిన్నతనం కొద్దీ వాడేన్నదో అన్నాడని బూట్ పాలిష్ చేస్తున్నవాడల్లా, ఆ పాలిష్ తీసి మన విక్కీగాడి స్కూలు కళ్ళే చొక్కాకి పూస్తానని బెదిరించేసరికి, వాడు ఒకటే ఏడుపు పావం!" కూతురు అలా చెప్తూండగానే -

"ఏడీ? ఆ వెధవ!" చాలా కోపంగా అడిగా డాయన కనబడని నూరిగాడిమీద మండిపడ్తూ.

"నే బాగా తిట్టాలే, మొహం మాడ్చుకుపోయాడు. ఇక్కడే ఉన్నారు కదా ఈయన. ఏమీ పట్టించుకోరు. పైగా ఏమిటయింది అని అడుగుతున్నారు?" భర్త మీద ఫిర్యాదు చేసింది.

ఆ మాటల కాయన అల్లుడి వంక చూసి - "ఏం మాట్లాడ్తాడు? అదుగో ఆ పుస్తకం ఒకటి ఉందిగా చేతిలో" - అని సరసంగా మాట్లాడి - "ఏవయ్యా అల్లుడూ, నిన్న సాయంత్రం ఆ పెద్ద ఇంజనీర్‌ని కలునుకోమన్నాను. కలుసుకున్నావటయ్యా?" అలా మామగారు అడిగేసరికి గుటకలు మింగాడు శేఖర్-

"మరండీ... నిన్న వెళ్దామనే అనుకున్నా..."

అతని మాటలకు అర్థం వస్తూ - "ఇహఁ చెప్పకులే అర్థమైంది. ఏ లైబ్రరీలోనో ఏదో కొత్త పుస్తకం చూసిన సంగతి నీ స్నేహితు డెవడో చెప్పి ఉంటాడు. అంతే నువ్వు సర్వం మరచి అక్కడకు పోయి ముక్కు మూసుకుని కూర్చుని ఉంటావు అవునా?" అంటూన్న మామగారి మాటలకు కొస్త తడబడ్తూ -

"అదే నిజమనుకోండి, కానీ మీ రనుకున్నట్టు ఎక్కువసేపు నే నా లైబ్రరీలో లేను. లైబ్రరీలో ఆ కొత్తగా వచ్చిన ఆ పుస్తకాన్ని ఓసారి చూసి, వెంటనే మీరు చెప్పిన ఇంజనీరు దగ్గరకు వెళ్ళాను. కానీ ఆయన వెళ్ళిపోయారు." మెల్లిగా చెప్పాడు.

దాంతో కొస్త ఖస్ మన్నాడు ఆయన - "మనం తీరిగ్గా మన పనులన్నీ చూసుకెళ్తే ఉంటారటయ్యా వాళ్ళు. చూశావటమ్మా? మీ ఆయన ఎంత బాధ్యతగా చేస్తున్నాడో పనులు! ఏవిటయ్యా ఇది? ఇలాగే ఉంటే మన కీర్తికి లక్షల కట్నం ఎలా ఇస్తావు? విక్కీకు లక్షల కట్నం ఎలా తెచ్చుకుంటావు? ఈ పనికిమాలిన కవిత్వాలు, ఈ పుస్తకాలూ - ఈ పిచ్చి ఎలా పట్టుకుందయ్యా నీకు?" అదేదో భయంకర వ్యాధి పట్టుకున్న మనిషిని చూసినట్టు చూశాడు శేఖర్ వంక లక్ష్మీనారాయణ.

"ఆఁ - ఈయన కీ జన్మలో తెలివితేటలు వస్తాయని నే ననుకోను" అని శేఖర్ వంక కోపంగా చూసి, విసావిసా వెళ్ళిపోయింది శ్రీలత.

లక్ష్మీనారాయణ లేస్తూ - "ఇదుగో చూడు! డామ్ దగ్గర మన పనులు జరుగుతున్నాయి. వెళ్ళి శ్రద్ధగా చూడు! ఏదో ఇంజనీరింగ్ చదువుకున్న కుర్రాడివి. నువ్వు నాకన్నా బ్రహ్మాండంగా కాంట్రాక్టులు చేసేస్తావనుకుంటే నేను నీకు చెప్పాల్సి వస్తోందే? నేనేం చదివానయ్యా? ఆఁ - ఒంటి రెక్కమీద గణించా నింత ఆస్తి. సరేలే పోయి పని చూడు. నే వెళ్తా" అంటూ వెళ్ళిపోతూన్న లక్ష్మీనారాయణని చూస్తూ-

"మీలాగే ఓ చదువుకోనివాడిని మీ అమ్మాయికి చేసి ఉంటే, నాలిగింతలయ్యే దీపాటికి ఆస్తి. నా ప్రాణాన బడి నన్ను చంపుతున్నారు." లోలోపల గొణుక్కున్నాడు శేఖర్.

** ** **

"డాడీ చిలక", "డాడీ చిలక" అని అరుస్తూ ఎగుర్తూన్న తన పిల్లలవంక అప్పుడే స్నానం చేసి వచ్చిన శేఖర్ ఏమిటన్నట్టుగా చూశాడు.

"డాడీ, డాడీ" ఎనిమిదేళ్ళ అతని కొడుకు విక్కీ శేఖర్ చేతిని పట్టుకుని, మహా ఉత్సాహంగా ఊపేస్తున్నాడు.

కొడుకు వంక నవ్వుతూ చూస్తూ - "ఏమిత్రా పుత్రా! ఆ డాడీ డాడీ ఏమిత్రా జాడీలా! నాన్నా అనలేవూ" అని తల తుడుచుకుంటూ అడుగుతున్న శేఖర్ని చూస్తూ - "ఫో డాడీ! నీ వెప్పుడూ అలాగే మాట్లాడ్తావు."

ఇంతలో కూతురు పరుగెత్తుకుంటూ వచ్చి - "డాడీ! చూడు, పంజరం దులపమంటుంటే నూరిగాడు దులపనంటున్నాడు" అంటూ ఫిర్యాదు చేసింది.

"పంజరమా? పంజరం ఎందుకు?" అర్థం కాక అడుగుతూన్న తండ్రి వంక చూస్తూ "అయ్యో, నీకేం అర్థం కాదు డాడీ. నా రూంలోకి ఓ చిలక, కాకులు తరుముతూ ఉంటే ఎగురుకుంటూ వచ్చి దాక్కుంది. చిలక గదిలోకి రాగానే తలుపు వేసి చెల్లీ, నేనూ దాన్ని పట్టేశాం. దా న్నిప్పుడు మరి పంజరంలో పెట్టాలి కదా, అందుకని మ నింట్లో ఉన్న పంజరం తీసి దులపమంటుంటే దులపనంటున్నాడు. పైగా తిరిగే చిలకని అలా పెట్టకూడదు, వదిలేయమంటున్నాడు."

కొడుకు చెప్పిన మాటలు వింటూ "అవున్రా, నూరిగాడు చెప్పింది కరక్టే, హాయిగా ఎగిరే చిలకని పంజరంలో పెట్టడ మెందుకు? వదిలేయండి. హాయిగా వెళ్ళిపోతుంది."

శేఖర్ చెప్పిన సలహా పిల్లల కెంతమాత్రం నచ్చలేదు. "హ-హ" అని రాగాలు తీస్తూ, ఇంతలో అక్కడకు వచ్చిన శ్రీలతని చూడగానే "మమ్మీ" అంటూ పరుగెత్తుకెళ్ళి తమ కోరిక చెప్పారు.

వాళ్ళ మాటలు విన్నాక శ్రీలత ఓసారి చురుగ్గా శేఖర్ వంక చూస్తూ - "మీ డాడీ అలాగే మాట్లాడతారు కానీ, నడవండి! నూరిగాడు మీ మాట ఎందుకు వినడో నే చూస్తాను? ఒరేఁ నూరీ!" అని పిలుస్తూ ముందుకు దూసుకుపోతూన్న తల్లి వెనకాల సంతోషంగా పరుగెత్తారు పిల్లలు.

** ** **

"సిన్నపిల్లా డమ్మా! తవ పిల్లల్తోపాటు తమరే ఆడి తప్పులు కాయాల."

ఎంతో వినయంగా అంటూన్న నూరి తండ్రిమీద కారాలు, మిరియాలు నూరుతూ - "ఎంత చిన్నపిల్లాడు అయితే మటుకు అంత మొండి అయితే ఎలా? పని సరేసరి - ఎప్పుడూ చెప్పింది సరిగ్గా చేయడు. మొన్న ఆమధ్య పండుగకి చేసిన బొబ్బట్లు మిగిలిపోతే ఫ్రిజ్‌లో పెట్టాం. పిల్లలు తిననంటున్నారు కదా పనిమనిషి కెందుకు? అని వీడికి పెడ్తే మొత్తం పారేశాడు. ఎంత పొగరో చూశావా నీ కొడుక్కి."

"ఏరా?" నూరిగాడి తండ్రి ఆ మాటలకి కళ్ళెర్రజేసి అడిగాడు కొడుకుని.


"నేనే కాదు. ఆటిని పనిమనిషి కిచ్చినా పారేసేది, ఎప్పటివో" ఉక్రోషంగా అన్నాడు.

"ఆఁ ఎప్పటివేనా? ఎన్ని అబద్ధాలు చెప్తున్నాడో?" శ్రీలత కోపంగా అటుంటే...

"ఏరా? ఆ ఐస్ బీరువాలో పెట్టినవి ఏం పాడవుతాయరా? వెధవ!" అంటూ నెత్తిమీద గట్టిగా రెండు మొట్టికాయలు వేశాడు.

అంతవరకూ ఇదంతా మౌనంగా ప్రేక్షకుడిలా చూస్తూన్న శేఖర్ - "ఆఁ ఆఁ ఏదో చిన్నతనం. ఫోరా ఫో! లోపలికి" అంటూ నూరిగాణ్ని లోపలికి పంపేశాడు. ఇంకా ఉంటే వాడు ఇంకా ఏం తిట్లు తినాల్సి వస్తుందో అని వాడు లోపలకి పోగానే-

"పని చేసే పయసు కాదు కదా, ఏదో అలాగే



ఉంటాడులే, కొద్దిగా వయసొస్తే వాడే తెలుసుకుంటాడు'' అని శేఖర్ చెప్పగానే...

సూరిగాడి తండ్రి ముఖం సంతోషంతో విప్పారింది - "అయ్! తవరు దయ బాబు. పెద్దయ్యగార్ని ఫాక్టరీ దగ్గర ఏదో సమయంలో ఖాళీగా ఉన్నప్పుడు కలుసుకుని ఎల్లిపోత నయ్యా! వత్తనమ్మా!" అంటూ వెళ్ళిపోయాడు.

శేఖర్ సూరిగాడి విషయంలో కల్పించుకున్నందుకు ఏదో అనేదే కాని శ్రీలత - ఇంతలో ఫోన్ మోగడం - ఎత్తిన ఆ ఫోన్ ఆవిడ స్నేహితురాలు పిలిచింది కావడంతో - ఆ సంభాషణా ప్రవాహంలో పడిపోయింది శ్రీలత.

దాంతో తేలిగ్గా నిట్టూర్చి పైకి వెళ్ళిపోయాడు శేఖర్.

** ** **

శేఖర్ - అతని మామగారు పురమాయించిన పనులన్నీ ముగించుకుని వచ్చేసరికి సాయంత్రమైపోయింది. ఇంటికి వచ్చేసరికి మామూలుగానే శ్రీలత లేదు.

కాఫీ తెచ్చిచ్చిన వంటావిడ్ని అడిగాడు తెలిసినా - "అమ్మగా రేరీ?" అని. "క్లబ్ కెళ్ళారండీ! టిఫిన్ ఇప్పుడు తింటారా? కొంచెంసేపయ్యాక తింటారా?" రొటీన్‌గా అడుగుతూన్న ఆ వంటమనిషి వంక విసుగ్గా చూస్తూ "నాకేం వద్దు గానీ పిల్లలు ప్రైవేట్ నుంచి ఇంకా రాలేదా?" అనడిగాడు. రాలే దన్నట్టుగా బుర్ర ఊపింది ఆవిడ.

పైకి వెళ్ళి బట్టలు మార్చుకుని చల్ల గాలికోసం బాల్కనీలో ఉన్న పేము కుర్చీలో కూలబడ్డాడు. క్రింద సూరిగాడు మొక్కలకి నీళ్ళు పోస్తూ కనబడ్డాడు. ఎర్రగా, బొద్దుగా ఉన్న సూరిగాడ్ని చూస్తూ వీడు ఏ డబ్బున్న ఇంట్లోనో పుట్టి ఉంటే ఇంకా బాగుండి ఉండేవాడు. ఇదే మాట శ్రీలతతో ఓసారి తనంటే - "ఆఁ ఇప్పుడు వాడికేం లోటటా? ముప్పొద్దులా మేస్తున్నాడు, వాడి ఊరునుంచి వచ్చినప్పుడు ఎలా ఉన్నాడు పీనుగులా" అంది వెంటనే. శ్రీలత మాటల్లోని అతిశయోక్తి జ్ఞాపకం వచ్చి నవ్వుకున్నాడు.

"అయ్యగారూ! కొబ్బరి నీళ్ళండీ!" ఆలోచన లాపి అటు చూశాడు శేఖర్. సూరిగాడు కొబ్బరి బొండాంతో నిల్చుని ఉన్నాడు. తనవంకే అభిమానంగా చూస్తున్న వాడి వంక చిరునవ్వుతో చూస్తూ - "ఏవిట్రా" అన్నాడు. "మధ్యాహ్నాం వచ్చాయండీ కొబ్బరికాయలు తోటనుంచి. తవర్ని నేను ఇప్పుడే చూశా. మా లేతగా ఉన్నాయి. తాగండి" అని అందించాడు. వాడికి తనమీదున్న ప్రేమకి, శ్రద్ధకి ఆనందపడుతూ తీసుకుని తాగాడు. ఎండాకాలం రాకపోయినా ఎండ ఆ రోజు తీవ్రంగా ఉండడంవల్ల కొబ్బరి నీళ్ళు మరీ బాగున్నాయి అనుకుని - "సూరీ! నువ్వు కూడా ఒకటి తాగరా" అన్నాడు. దానికి వాడు భయంగా కళ్ళు రెప రెపలాడించి "బాబోయ్! నేనాండీ? అమ్మగారికి తెలిసిందంటే..." అని అంటూన్న వాడిని చూసి చేసేది లేక నిస్సహాయంగా నవ్వాడు శేఖర్.

వెళ్ళిపోతూన్న వాడ్ని చూస్తూ - రెండేళ్ళ క్రితం తనే వెళ్ళి వాడ్ని ఇక్కడ పనిలోకని తీసుకొచ్చాడు. అసలు ఇంట్లో పనికి నమ్మకమైన పనివాడికోసం శ్రీలత తపస్సు చేసినంత పని చేసింది. పని కుర్రాడికోసం కనబడిన అందర్నీ అడుగుతుండేది. "ఈ కాలంలో ఎవడి దగ్గర నమ్మకముందని" కొందరు, "ఎవ్వాళ్ళూ పని బాగా చేయడంలే దీ రోజుల్లో" అని మరి కొందరు దాటేస్తుండేవారే తప్ప, ఎవరూ మనిషిని తీసుకొచ్చేవారు కాదు. చివరికి సూరిగాడు తండ్రి తన మామగారి పొలం పనులు చేస్తుంటాడు. అతను ఒకసారి ఏదో పని మీద ఇంటికి వస్తే శ్రీలత అందరితో అన్నట్టే అతనితోనూ పని వాడి అవసరం గురించి చెప్పింది. అప్పు డతను అతని కో పన్నెండేళ్ళ కొడు కున్నాడని, ఏపైనా ఇక్కడ చేస్తాడేమో ఆడ్ని ఆడి అమ్మని కనుక్కుని వెంటనే చెప్తా నన్నాడు. శ్రీలత అతని మాటలు పూర్తి కాకుండానే - "ఇంక కనుక్కునే దేముంది? మేం తిండీ అన్నీ శుభ్రంగా పెడతాం, పైగా జీతం కూడా ఇస్తాం. నాన్నగారు రాగానే చెప్తాను. ఈయన కారు తీసుకుని వస్తారు. కారులోనే పంపేయ్ నీ కొడుకుని" అని గడగడా చెప్పేసి, అప్పుడే బయటనుంచి వచ్చిన తనకు ఆర్డర్ జారీచేసి, తండ్రి రాగానే అంత చెప్పి ఓ.కే. చేయించుకుంది.

ఆ రోజు ఒళ్ళంత నొప్పులుగా, బద్ధకంగా ఉన్నా చచ్చినట్టు కారు తీసుకుని సూరిగాడి ఊరికి వెళ్ళక తప్పలేదు తనకు.

కారులోంచి దిగిన తననీ, సూరిగాడి తండ్రినీ చూసి సూరిగాడి కుటుంబం ఆశ్చర్యపోయారు. తనకు మర్యాద చేశారు. విషయం వినగానే శ్రీలత అనుకున్నట్టు వాళ్ళేం ఎగిరి గంతేయలేదు. సూరిగాడైతే మరీను. అంతవరకూ విప్పారిన వాడి ముఖం ముడుచుకుపోయింది. సూరిగాడి తల్లి మొగుడ్ని చాటుకు పిలిచి ఏదో మాట్లాడింది. మొత్తానికి అలా తర్జన భర్జన అయ్యాక, వాళ్ళంతా దిగులు మొఖాల్తో, బిక్కమొగంతో ఉన్న సూరిగాడ్ని తనతో పాటు పంపించారు.

అలా సూరిగాడు ఎన్నాళ్ళనుంచో కోరుకున్న నమ్మకమైన పని కుర్రాడిగా ప్రవేశించి ఎన్నో పనులు చేస్తున్నా శ్రీలతకు తృప్తి ఉండదు. అలాంటి కుర్రాడి కోసం తా నెంత తాపత్రయపడిందీ మరిచిపోయింది. శ్రీలత స్వభావమే అంత. వాడ్ని ఈ రెండేళ్ళలో ఒక్కసారి వాళ్ళ ఊరు పంపలేదు. వాడి తండ్రి వచ్చి వాడ్ని చూసుకోవాల్సిందే. భయం! వాళ్ళ ఊరు వెళితే రాడని. వాడి అవసరం అంత ఉన్నది కదా కాస్త ప్రేమగా చూస్తే ఏమో? - అలా ఏవేవో ఆలోచనల సుడిలో కొట్టుకుపోతూన్న శేఖర్.


"డాడీ! డాడీ! చిలకకి దానిమ్మవండు, జాంపళ్ళూ పెట్టానా? ఏం తినడంలేదు." ప్రైవేటు నుంచి వచ్చిన కొడుకు ఫిర్యాదు చేశాడు. "మీరేం పెట్టినా అంతేనండీ! అది తినదు. పంజరంలో దాన్ని పెట్టేశారని దానికి బెంగ" అన్నాడు సూరి వాళ్ళ పుస్తకాలు లోపల పెడ్తూ. "ఏం? ఎందుకుటా? ఇంతకన్నా మంచి పళ్ళు వదిలేస్తే దానికి దొరుకుతా యా?" ఆరేళ్ళ కూతురు సూరిని నిలదీస్తోంది. కూతురి మాటల్లో, ఆ అడిగే తీరులో - భార్య మామగార్ల అతిశయం ఛాయలు కనిపించి పోలికలు ఎలా వస్తాయి? అనుకుని నవ్వుకున్నాడు.

ఇంతలో తన స్నేహితు డెవరో రావడం, బాల్కనీలోంచి చూసి కిందకు దిగాడు శేఖర్.

** ** **

గుమాస్తా తెచ్చి పడేసిన ఆ ఎక్కౌంట్ బుక్స్ తనిఖీ చేస్తూ తల పట్టుకున్నాడు శేఖర్ విసుగ్గా. ఇంతలో ఫోన్ మోగడంతో ఫోన్ ఎత్తి "హల్లో" అని - "ఓ మూర్తా! సారీరా! నేను మీటింగ్‌కు రాలేను. ఈ రోజు మా మామగారు అర్జెంటు పనిమీద హైదరాబాద్ వెళ్ళారు. ఓ నాలుగు రోజులు వరకూ రారు. అందుచేత, ఆయన వచ్చేవరకు ఫాక్టరీ వ్యవహారాలు, మిగిలిన వ్యవహారాలు చూడమని గట్టిగా చెప్పి వెళ్ళార్రా. అందుచేత నే రాలేన్రా. మీరంతా వెళ్ళండి" అని చెప్పి ఫోన్ పెట్టేసి నిరాశగా నిట్టూర్చాడు.

"ఛ! తన అభిమాన కవికి పెద్దఎత్తున



సన్మానం జరుగుతుంటే, తనూ తమ సాహితీ మండలి తరువున వెళ్ళి పూలదండ వేసి ఆయనతో మాట్లాడే భాగ్యం పొందుదా మనుకున్నాడు. తన బ్రతుక్కి అంత అదృష్టం కూడానూ? - అస లీ బ్రతుకు బలవంతాన తనకు పూసిన తన తండ్రిని అనాలి'' అనుకున్నాడు విసుగ్గా.

''అంత కోటీశ్వరుడు, అతనంతట అతనుగా వచ్చి అడుగుతుంటే? అలా ఆలోచిస్తావు? నాలుగు లక్షలు కట్నంగా ఇస్తా నంటున్నాడు! నిన్ను హాయిగా ఆయన్తో పాటు వ్యాపారాల్లో తిప్పుతా నంటున్నాడు. ఇంతకన్నా మంచి అవకాశం నీ ముఖానికి ఎన్ని జన్మలెత్తినా వస్తుందిరా? బి.ఇ. పాసయ్యా వన్నమాటే గానీ ఉద్యోగం ఏదిరా? రెండేళ్ళ నుంచి ఖాళీగా ఏ ఉద్యోగం లేకుండా ఉన్నావు కదా! ఎందు కొచ్చిన అవస్థలు? నీతో పాటూ నాకూ తప్పుతాయిరా బాధలు. నీ చెల్లి పెళ్ళి నీ కట్నం డబ్బుతో ఎక్కువ కష్టపడకుండా చేసేయచ్చు. వర్షాధారం భూముల్తో మనం ఆడపిల్ల పెళ్ళి చేయగలమా చెప్పు? నా మాట విను. పిచ్చి ఆలోచనలు మాని ఈ సంబంధం ఒప్పుకుని సుఖపడు. సిరి వస్తాంటే మోకా లడ్డకు.'' ఇలా రకరకాలుగా ఈ సంబంధం వచ్చిన లగాయతూ తన బుర్ర తినేయసాగాడు తండ్రి.

తల్లి మటుకు - ''ఎందుకులే ఇల్లరికం! ఎంత్ర సంపద ఉన్నా మొగాడికి ఏ సుఖం ఉండదు. అంత చదువు చదువు కున్నోడికి ఉద్యోగమే రాకపోతుందా? ఈ ఏడాది కాకపోతే పై.ఏడాది'' అంటూ తండ్రి మాటల్ని ఖండిస్తూ ఉండేది.

కానీ తన మామగారు కబురుమీద కబురు చేయడంతో, తన తండ్రి లాంఛనాల దగ్గర మరి కాస్త రేటు పెంచేసి బలవంతాన తల్లినీ, తననీ ఒప్పించేశాడు.

ఒక రకంగా తన తల్లి అన్నట్టే - శ్రీలత, మామగారూ తనని ఓ కొనుక్కున్న పశువులా చూస్తారే తప్ప - ఇంతలో మళ్ళీ ఫోన్ మోగడంతో ఆలోచన లాపి ఫోన్ ఎత్తాడు శేఖర్.

** ** **

''ఏవండోయ్! మిమ్మల్నే? ఇప్పు డా కవిత్వం రాయకపోతే నేవట? ముందు నే చెప్పేది వినిపించుకోండి.'' గంయ్‌మంటూ కందిరీగలా చెవి దగ్గర రొద పెడ్తూన్న శ్రీలత కేకలకి, పెన్ కాగితాల మీద పడేసి - ''ఆఁ ఏవిటీ? ఏ మొచ్చిం దిప్పుడు'' కోపాన్ని అణిచిపెట్టుకుంటూ అడిగాడు. శ్రీలతకైతే ఆ మాటలకి కోపం తారాజువ్వలా ఎగిసిపడింది. ''నా కేమొచ్చిందా? రోగం. ఆ సూరిగాడు మానేసి నెలవుతూంది. అప్పట్నించీ నే నెంత అవస్థ పడుతున్నానో మీకేమైనా పట్టిందా అని. వా డింట్లో ఉంటే నా కెంత హాయిగా ఉండేది! నే నెక్కడకు వెళ్ళినా - పనిమనిషి వంట మనిషి వచ్చినా, రాకపోయినా, పిల్లలు ఏవేళ ప్రైవేట్ నుంచి వచ్చినా! - అసలు ఇబ్బందే ఉండేది కాదు. మా క్లబ్ యానివర్సరీ తేదీ దగ్గర పడిపోతోంది. నాకు ఎన్ని పను లున్నాయో చెప్పలేను. ఈ పరిస్థితుల్లో నౌకరు లేకపోతే చాలా కష్టంగా ఉంది నాకు.'' శ్రీలత 'ఉస్సు' అంటూ అప్పటికి తన వాక్ప్రవాహం ఆపి, తనవంకే కళ్ళార్పకుండా చూస్తూన్న శేఖర్ వంక కోపంగా చూస్తూ ''ఏవిటీ? అలా గుడ్లప్పగించారు. నే చెప్పింది ఏమైనా బుర్ర కెక్కిందా? లేదా?'' అని గదమాయించేసరికి.

''ఎందుకు ఎక్కలేదు! బ్రహ్మాండంగా ఎక్కింది. నిజమే! పాపం! నీకు కష్టమే! పోనీ మీ ఫ్రెండ్స్‌తో చెప్పి చూడలేకపోయావా, ఎవరైనా కొత్త నౌకర్ని చూడమనీ.''

శేఖర్ మాటలు అందుకుంటూ - ''ఆఁ. ఇదేమైనా బజారులో కొనుక్కునే వస్తు వనుకున్నారా? నమ్మకమైన నౌకర్లు అలా తేలిగ్గా దొరకడానికి. మళ్ళీ ఆ సూరిగాణ్ణే పిలుద్దాం'' అంది.

''సూరిగాడ్నా!'' ఆశ్చర్యపోయాడు శేఖర్.

''అవును సూరిగాడ్నే! ఏం? ఎందు కంత ఆశ్చర్యం?''

''అహాఁ. అది కాదోయ్. వాడు పని చేస్తున్నంత కాలం, వాడు సరిగ్గా పని చేయడంలేదని సాధిస్తుండే దానివి కదా. పోయాడు కదా వాళ్ళింటికి. చిన్న వయసు వా డలాగే చేస్తాడు. వాడి పని నీకు నచ్చదు. వేరేవాడ్ని చూసుకుందాం'' అంటూన్న శేఖర్ మాటల్లోని అర్థం తెలుసుకుని - ''ఓహోఁ. నే నేదో అనవసరంగా వాడ్ని సాధించానని... ఏం జాలి? తిక్కపనులు చేస్తుంటే తిట్టేదాన్నేమో! ఆ గొడవంత అనవసరం. ఇప్పుడు వాడు నాకు అవసరం. గుమాస్తాతో మొన్న కబురు పెట్టిస్తే వాడి తండ్రి జ్వరంతో పడుకున్నాడట. వాడ్ని అడిగితే నే రాను పొమ్మన్నాడట! వాడు ఎవరి మాట వినడు కాని మీ మాట వింటాడు. అందుకే తక్షణం బయలుదేరి వాడ్ని ఎలాగైనా తీసుకురండి.'' శ్రీలత బలవంతం పెట్టసాగింది.

''అబ్బబ్బా! నీ కెంత తోస్తే అంత. ఈ రోజు మా సాహితీ మండలి వార్షికోత్సవం. అందులో కవితకు నా పేరు కూడా వేసుకున్నారు.'' శేఖర్ మాటలు పూర్తి కాకుండానే ''వేసుకుంటే వేసుకున్నారులెండి. మీ పిచ్చి కవిత్వం చదవకపోతే ఏం ప్రమాదం లేదు. మళ్ళీ ఎల్లుండి ఏదో వ్యాపారం పనిమీద నాన్న మిమ్మల్ని హైదరాబాద్ పంపుతారట'' - అని ఇంకా ఏదో అనబోతూండగా, అక్కడకు అప్పుడే వచ్చిన తన తండ్రిని చూసి - ''చూడు నాన్నా ఈయనా!'' అంటూ శేఖర్ మీద కంప్లెయింట్ ఇచ్చింది.

అది విన్న ఆయన కూతురు కన్నా తేలిగ్గా తీసిపారేస్తూ - ''ఆఁ. నీ మీటింగ్‌ల కే వుంది లేవయ్యా? మ నిద్దరం వ్యాపార పనులమీద తిరుగుతుంటే ఎవడో ఓ నమ్మకమైన మనిషి అమ్మాయికి తోడు లేకపోతే ఎలా? వెళ్ళు నువ్వు చెబితే ఆడు వస్తా డంటూంది కదా అమ్మాయి'' అన్నాడు.

శేఖర్‌లో కోపం వేడెక్కుతోంది.

''ఈయన ఒక్కరూ వెడితే పని అయ్యేట్టు లేదీసారి. నేను కూడా వెళ్తా నాన్నా'' అంది శ్రీలత.

''అలాగే నమ్మా! ఆదివారం కదా. పిల్లల్ని కూడా తీసుకెళ్ళండి. ఈమధ్య వాళ్ళు మన పొలాల్ని చూసి చాలా కాలమయింది కదా! అవీ చూస్తారు. పెద్ద కారు తీసుకెళ్ళండి. డ్రైవర్ని తీసుకెళ్ళకండి సుమా. నాకు చిన్న కారుకి కావాలి'' అంటుంటే...

''తీసుకువెళ్ళంలే నాన్నా! ఈయన ఉన్నారుగా'' అంటూన్న శ్రీలత వంక చూస్తూ-

''నా ఖర్మకాలి డ్రైవింగ్ నేర్చుకుని డ్రైవర్‌గా మారానుగా, మ రెందుకులే డ్రైవర్ మావయ్యా!'' గొణుక్కున్నాడు అక్కసుగా.

''తాతా! తాతా! చిలక తప్పించుకుని ఎగిరిపోయింది'' అంటూ పరుగున వచ్చి ఏడ్పు ముఖంతో అంటూన్న మనవల్ని చూస్తూ - ''అరేరే! ఎగిరిపోయిందా! పోతే పోనీయండి దాన్ని! ఈసారి మద్రాస్ నుండి మైనాను తీసుకువస్తాను సరేనా?'' సముదాయించాడు మనవల్ని.

మనవరాలికి అంత దుఃఖంలోనూ సందేహం వచ్చింది - ''అది మటుకు తప్పించుకోదా?''

''ఎందుకు తప్పించుకుంటుంది? గట్టిగా



ఈసారి పంజరంలో దాని కాళ్ళని తాళ్ళతో నేనే కట్టి పడేస్తాగా. ఇంక ఎగరదు.'

ఆ మాటలకు పిల్లలు మైనా బందిఖానా ఊహించుకుని ఆనందంగా చప్పట్లు కొట్టేశారు.

'అవును. ప్రాణాల్నీ స్వేచ్ఛనీ కట్టివడేయడం మీ కొచ్చినంతగా ఎవడి కొచ్చు?' కోపంగా అనుకుని, తాను అంతక్రితం అపురూపంగా రాసుకున్న ఆ కవిత్వపు కాగితాల్ని ఉండలుగా చేసి నలిపి అవతల పారేశాడు శేఖర్ చేసేది లేక.

** ** **

ఎర్రటి ఆ కొత్త మారుతీ వ్యాన్ త మింటి ముందు ఆగగానే నూరిగాడి తల్లీ, తండ్రీ ముందు కంగారుపడి, ఆ తరువాత వ్యాన్ తలుపులు తెరుచుకుని దిగుతున్న శేఖర్‌నీ, శ్రీలతనీ, పిల్లల్నీ చూసి పట్టరాని ఆనందంతో ఆహ్వానించారు ఇద్దరూ ముక్తకంఠంతో. "అమ్మ బాబోయ్! అందరూ వచ్చేశారు. ఏ టిశేషం? కబురంపలేక పోయారమ్మా వస్తున్నట్టూ!" అని అంటూ నూరిగాడి తండ్రి భార్యను తొందర చేసి ఇంట్లో ఉన్న రెండు పాత కుర్చీలు తెప్పించి వేయించాడు.

శేఖర్, నూరిగాడి తండ్రికి ఏదో సమాధానం చెప్తున్నాడు కానీ, శ్రీలత కళ్ళుమటుకు నూరిగాడి కోసం కాబోలు వెదుకుతున్నాయి "నూరిగాడు ఏడని?" దానికి జవాబుగా తల్లి - "ఉండాలమ్మా ఇక్కడనే ఇప్పటిదాకా గొడ్లను కాసి వచ్చాడు. ఎక్కడకు పోయాడో?" అంది.

"ఈ ఖర్మ ఎందుకు వాడికి. హాయిగా నీడ పట్టున ఉండచ్చు కదా మా దగ్గర. ఎంత బాగా చూశాం మేం. ఇక్క డేదో వైభోగం ఉన్నట్టు వచ్చేశాడు." నీలం కళ్ళద్దాలు పెట్టుకుని మాట్లాడుతున్న శ్రీలత వంక చూస్తూ - "అయ్యఁ నేనూ సెప్పానమ్మా తవ రింటికాడే బాగుంటాదీ' అని. ఇనుకుంటేనా? సివరికి ఇనుగెత్తి నాలుగు తన్నాను కూడా నమ్మా. ఇంటేనా? అయ్యగారి మాట మన్నింపలేకపోతున్నందుకు బాదగా ఉందమ్మా. ఆ రేటి అనుకుంటున్నారో అని" అన్నాడు బాధగా తల నిమురుకుంటూ అన్నాడు నూరిగాడి తండ్రి.

"సరలే. ఏదోలా వాడ్ని ఒప్పించి, వాడ్ని మాతో తీసుకువెళ్లామని అలవాటు లేకపోయినా వీడికోసం ఆదివారమైనా పదకొండు గంటలకే భోజనాలు చేసి బయలుదేరాం తెలుసా?" అంది - అదేదో వాళ్ళని ఉద్ధరించడానికి తా నా పని చేసినట్టు చెప్పింది.

"అలాగే సండమ్మా. ఆడ్ని రానీయండి" అన్నాడు వినయంగా నూరిగాడి తల్లీ, తండ్రీ.

నూరిగాడు కోసం ఓ గంట ఓపిగ్గా "పిల్లలు, పొలాలు చూద్దాం" అని పేచీ . పెడుతున్నా వినకుండా శ్రీలత కూర్చోడంతో శేఖర్‌కీ కూర్చోక తప్పింది కాదు. శ్రీలత అవస్థకి అతనికి కోపంతో పాటు నవ్వు కూడా వస్తోంది.

"ఉష్!" - విసుగ్గా వాచీ చూసుకుని - "వీడు ఎప్పుడూ ఏ వేళకి వస్తుంటాడు?" అడిగింది విసుగా.

మంచి పోషక విలువలున్న వాటిల్లో పుట్టగొడుగులు ఒకటి. పుట్టగొడుగులు వర్షాకాలంలో ఎక్కువగా కనిపిస్తాయి. మృదువైన పుట్టగొడుగులు దృఢమైన రోడ్డును పగలగొట్టి పైకి రాగలవా? వస్తాయంటే, వాటిలో అంత శక్తి ఉందంటే ఆశ్చర్యం కలగక మానదు. పుట్టగొడుగులు పెరుగుతున్నప్పుడు తమ దారిలో ఉన్న వాటిపైన ఎంతో పీడనాన్ని చూపుతాయి. ఈ పీడనం ఏడు అట్మాస్ఫియర్లవరకు ఉండవచ్చు. ఒక కారు టైరులో పీడనం రెండు అట్మాస్ఫియర్లకన్న తక్కువే. దీన్ని బట్టి పుట్టగొడుగు చూపే పీడనం ఎంత శక్తివంతమైనదో పోల్చుకోవచ్చు. ఈ పీడనానికి దృఢమైన రోడ్డు పగిలిపోక తప్పదు మరి.

-నమ్మెట గోవర్ధన్

"ఎప్పుడూ ఈ ఎలకల్లా వచ్చేత్త డమ్మా. మరీ!" అంటున్న నూరిగాడి తల్లివైపు చూస్తూ - "సరే! మేం అలా పొలాలవైపు వెళ్ళి వచ్చేస్తాం. ఇంతలో వాడు రావచ్చు" అంటూ శ్రీలత లేవగానే ఆమెతో పాటు అందరూ ముందుకు నడిచారు. వచ్చని పైరుల అందాల్ని చూసుకుని కాసేపు అలా తిరిగి నూరిగాడి కోసమని మళ్ళీ వా ళ్ళింటికి వెళ్ళడమే మిగిలింది తప్ప నూరిగాడు రాలేదు. చేసేది లేక నూరిగాడి తల్లీదండ్రితోటే వాడ్ని ఏదోలా ఒప్పించి పంపమని, తనకు చాలా అవసరమని మరీ మరీ చెప్తూ వ్యాన్ ఎక్కింది.

వ్యాన్ బయలుదేరింది. చల్లటి గాలి రివ్వుమంటూ వీస్తూంది - "వెధవ! ఎక్కడకి పోయాడో" తిట్టుకుంటోంది శ్రీలత. కొంత దూరం వెళ్ళాక వ్యాన్ విండోలోంచి తలలు కొద్దిగా బయటకు వంచి చూస్తూన్న పిల్లలు - "అడుగో, అడుగో నూరిగాడు" అంటూ అరవడం మొదలుపెట్టారు. "ఎక్కడ? ఎక్కడ?" అంటూ శ్రీలత కళ్ళు ఆత్రతగా వెయికాయి.

సడన్ బ్రేక్ వేసి వ్యాన్ ఒక్క కుదుపున ఆపాడు శేఖర్ - "అడుగో అడుగో..." వేలు పెట్టి చూపిస్తున్నారు పిల్లలు.

పిల్లల్నీ కారునీ గుర్తుపట్టాడు కాబోలు ఎదురుగా ఉన్న పెద్ద చెట్టుమీద నిక్కరేసుకున్న నూరిగాడు, చెట్టు కొమ్మమీద హాయిగా కోతికొమ్మచ్చు లాడుకుంటున్న వాడల్లా వాళ్ళని చూసి చేయి ఊపాడు.

శేఖర్, శ్రీలత, పిల్లలు వ్యాన్ దిగారు. వాడు చెట్టుమీదనుంచే "బాగున్నారండీ అయ్యగారూ!" కేకలేస్తున్నాడు.

శరీరంపై నేమీ ఆచ్ఛాదనం లేకుండా, ఏదో పాత నిక్కర్‌తో చెట్టుమీద గంతులేస్తున్న వాడ్ని చూసి, చిరాకు పడిపోతూ - "వెధవ! ఎంత దర్జాగా ఉన్నాడో!" తెగ చిరాకు పడిపోయింది శ్రీలత.

అంత ఎత్తు కొమ్మమీద పల్టీలు కొడుతున్న వాడ్ని హీరోలా పిల్లలు చూస్తూంటే, వాడి స్వేచ్ఛా జీవనానికి మనసులో జోహార్లర్పించుకుంటూ-

"ఒరే నూరిగా మేం నీకోసమేరా వచ్చాం" అన్నాడు శేఖర్.

"హీహీఁ తెలుసండీ. కారు సూసా. పారిపోయా" నిర్భయంగా చెప్తున్నాడు వాడు.

"రాస్కెల్! ఉండు! నీ పొగరు అణచకపోతా నా?" పళ్ళు పటపట లాడిస్తూ అనుకుంది శ్రీలత.

"ఏటీ? అలా నూత్తారు. ఎక్కుతారా ఈ సెట్టు. రండి. ఎక్కిత్త!" ఆశ్చర్యంగా చూస్తూన్న పిల్లల్ని అడిగాడు.

వాళ్ళు సంబరంతో వాడి దగ్గరకు వెళ్ళబోతూంటే ఒక్క కసురు కసిరి ఆపింది.

"పోనీలేండి బాబూగారూ! నేను ఈడనుండి కింద సెరువులోకి దూకుతా నూత్తా రా?" పిల్లల్ని ఎంటర్‌టైన్ చేద్దామనే ఉద్దేశంతో అడుగుతున్నాడు వాడు.

"దూకు! దూకు!" పిల్లలు మహానందంగా అన్నారు అంతే! రెప్పపాటులో వాడు స్విమ్మింగ్‌పూల్‌లో పడినట్టుగా ధన్‌మని ఆ చెరువులో దూనుకుపడి, ఈత కొట్టసాగాడు మహావేగంగా! వా డలా ఈత కొడ్తూంటే పిల్లలు కేరింతలు కొట్టారు. వాడు నీళ్ళలోంచి తల పైకెత్తి - "బాబుగారూ! సిల కెలా ఉందండీ" అడిగాడు. "పోయింద్రా" ఎంతో బెంగగా చెప్పారు వాళ్ళు.

"పోతుందండి. ఎంత కాలమని మీ బందిఖానాలో ఉంటదీ? ఆళ్ళ అమ్మ దగ్గరకు ఎల్లిపోయిం దన్నమాట. అదగదుగో! బాబూ, పాపా. నూడండీ - అదే కదూ మీ సిలక. ఎంత ఆయిగా ఎగర్తుందో" అని అల్లరిగా నవ్వుతూ రెక్కలు చాచుకుని హాయిగా ఎగిరిపోతూన్న ఏదో సిలకని చూపించాడు.

పైన ఎగిరిపోతూన్న ఆ చిలకనీ - నీళ్ళలో స్వేచ్ఛగా ఈదులాడ్తూ పకపకమని నవ్వుతూన్న నూరిగాడ్నీ చూస్తూ - మనిషివంటే నువ్వేరా! జన్మహక్కైన స్వేచ్ఛా వాయువును ఎంత హాయిగా పీల్చుకుంటున్నావు! డబ్బుకు అమ్ముడుబోయిన నా కెలా వస్తుందిరా ఈ హాయి! స్వేచ్ఛ లేని నేను జీవచ్ఛవాన్నిరా! జీవచ్ఛవాన్ని! అలా మనసులో అనుకుంటూన్న శేఖర్ శ్రీలత గద్దింపుతో ఉలిక్కిపడ్డాడు.

"ఏవిటీ? మనం ఇక్కడకు వచ్చింది ఈ వెధవ కోతి పనులు చూడడానికా? నడవండి. నాన్నతో చెప్పి వీడి తండ్రిని మా పొలం పనులు చూడడం మాన్పించేస్తాను. అప్పుడు కుదుర్తుంది తండ్రీ, కొడుకుల తిక్క" అని విసవిసగా నడుస్తూ, పిల్లల్ని కూడా చెవి మెలి పెట్టి తనకూడా తీసుకెళ్ళి వ్యాన్‌లో కూలేసింది.

శ్రీలత వెనకే తాపీగా అడుగులు వేసుకుంటూ నడుస్తూ - "వాళ్ళేం, నాలా చదువుకున్న వా ళ్ళనుకున్నావా డియర్! ఎక్కడా బ్రతకలేకపోవడానికి. స్వేచ్ఛాజీవులు! కష్టజీవులు! ఎలాగైనా వాళ్ళు బ్రతకగలరు. నీ శ్రమ అంతే" అనుకుంటూ వ్యాన్ ఎక్కి స్టార్ట్ చేశాడు.

నూరిగాడు నీళ్ళలోంచి గట్టుమీద కొచ్చి శేఖర్‌కి చేతు లూపాడు. శేఖర్ ప్రతిగా నవ్వుతూ చేయి ఊపాడు. పిల్లలు సరేసరి తల్లి గదమాయిస్తున్నా వినకుండా - "నూరీ టాటా! నూరీ టాటా!" అని అరుస్తూంటే వాడూ "టాటా" అని అరుస్తూ ఉషారుగా చేతు లూపాడు. చేసేది లేక కోపాన్ని అణిచిపెట్టుకున్న శ్రీలతను చూసి నవ్వుకుంటూ స్పీడుగా పోనిచ్చాడు వ్యాన్‌ని శేఖర్. ★